క్లుప్తంగా

ప్రశాంతంగా టెట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. పేపర్‌మిల్ సమీపంలోని రాజీవ్‌గాంధీ విద్యా సంస్థల్లోని ఇయాన్ డిజిటల్ జోన్‌లో బుధవారం ఉదయం సెషన్‌లో జరిగిన పేపర్ -1ఏ ఎస్‌జీటీ పరీక్షకు 240 మంది హాజరుకావాల్సి ఉండగా 218 హాజరయ్యారని, 22 మంది గైర్హాజరు అయినట్టు వాసుదేవరావు తెలిపారు. సెషన్ -2లో పేపర్-1ఏ పరీక్షకు 240 మందికి 220 మంది హాజరయ్యారని, 20 మంది గైర్హాజరయ్యారన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లుగా అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు కోలా సత్యనారాయణ, గణపతి వ్యవహరిస్తున్నారు.

ఆర్యాపురం బ్యాంకును అగ్రగామిగా తీర్చిదిద్దుతాం



పోస్టల్ సిబ్బందిని సత్కరిస్తున్న లైన్స్ క్లబ్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామని చైర్మన్ చల్లా శంకరరావు అన్నారు. బ్యాంకు ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు డిపాజిట్లను రూ.వెయ్యి కోట్లకు పెంచాలని, రుణాలను రూ.700 కోట్లకు చేర్చాలని నిర్ణయించామన్నారు. ఎన్‌పీఏపై దృష్టి సారించి, రిజర్వుబ్యాంకు విధించిన సూపర్‌వైజరీ యాక్షన్ ఫ్రేమ్ (శాప్) నుంచి బయటకు తీసుకురావడానికి కృషి చేసినట్లు తెలిపారు. ఎన్‌పీఏను తగ్గించి, శాప్ నుంచి బయటకు తీసుకు రావడం ద్వారా సభ్యులకు 15 శాతం డివిడెంట్ పునరుద్ధరించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. సెప్టెంబరు 30 అర్ధ సంవత్సరం నాటికి డిపాజిట్లు రు.683.13 కోట్లు, రుణాలు రూ.427.38 కోట్లు, బ్యాంకు వ్యాపారం రూ.1107.51 కోట్లు, ఇన్వెస్ట్‌మెంట్స్ రూ.334.78 కోట్లుగా ఉన్నాయన్నారు. బ్యాంకు స్థూల లాభం 8.25 కోట్లు, నికర లాభం రూ.3.48 కోట్లుగా ఉందన్నారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ పోలాకి పరమేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 27మంది ఎంపిక

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులో కలెక్టరేట్ ఆవరణలో నేక్ సెంటర్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ, నేక్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 27 మంది ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన, జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్, నేక్ ఏడీ జి.రాజు మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో 4 కంపెనీలు పాల్గొనగా 81 మంది హాజరుకాగ 27 మంది ఎంపికయ్యారన్నారు. ఏడీఎస్‌డీవో పెరుమాళ్, స్కిల్ కాలేజీ కో ఆర్డినేటర్ శ్రీరామచంద్రమూర్తి, స్కిల్, హబ్ కో ఆర్డినేటర్ రాజా కాశేట్, జిల్లా నియామక అధికారి డి.పావనీప్రియ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే మెముకార్ షెడ్‌లో సమస్యలను పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే పీసీఎంఈ(ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్) మధుసూదనరావుకు మెముకార్ షెడ్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. బుధవారం రాజమహేంద్రవరం పర్యటన సందర్భంగా మెము కార్ షెడ్‌ను తనిఖీ నిర్వహించారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పెరిగిన పని భారానికి అదనపు పోస్టు ఇవ్వాలని, మహిళా కార్మికులకు వసతులు కల్పించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టు మాస్టర్, పోస్టుమన్లకు సత్కారం

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ డిపార్టుమెంట్ కమర్షియల్ దృక్పథంతో కాకుండా, సేవా దృక్పథంతో పని చేస్తుందని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మద్దుల వి ఎస్.శ్రీరామ గుప్తా కొనియాడారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్టాఫీస్‌లో ప్రపంచ పోస్టల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన పోస్ట్ మాస్టర్ జి.సువర్ణరాజు, పోస్ట్‌మెన్లు సేనాపతి కామరాజు ,శ్రీనివాసరావు, లక్ష్మణులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ వెన్నా కుమారస్వామి, క్లబ్ అడ్మిన్ లైన్ గ్రంధి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో రూ.3.30 లక్షలు మోసం

రాజమహేంద్రవరం రూరల్: ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశ చూపి ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తి తన నుంచి దఫదఫాలుగా రూ.3.30 లక్షలు వేయించుకుని మోసం చేశారని పిడింగొయ్యి శాంతినగర్‌కు చెందిన రొక్కం వెంకటలక్ష్మి బుధవారం బొమ్మూరు పోలీసులకు పిర్యాదు చేసింది. ఆమె ఆన్‌లైన్‌లో ఉద్యోగాల కోసం వెతుకుతుండగా టెలిగ్రామ్ యాప్‌లో గుర్తుతెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ఆన్‌లైన్ వీడియోస్‌కి రేటింగ్ ఇస్తే డబ్బులు వస్తాయని నమ్మబలికాడు. వెంకటలక్ష్మి నుంచి ఆన్‌లైన్‌లో దఫదఫాలుగా 3.30 లక్షలు తీసుకున్నాడు. ఇంకా డబ్బులు పంపాలని అడుగుతుండడంతో వెంకటలక్ష్మి పోలీసులకు పిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళలకు వేదిక.. దేవీచౌక్..

- రంజింప చేస్తున్న నాటకాలు
- దేవీచౌక్‌లో 91 సంవత్సరాలుగా నాటకాల ప్రదర్శన
- వాటిని చూసేందుకు వచ్చిన కళాకారులు, సినీ తారలు

సీటీఆర్‌ఐ: గతంలో నాటకాలు ప్రజలకు ఒక ఊరట కలిగించేవి. కళ్లముందు స్పెషల్ ఎఫెక్ట్స్‌తో, రాగయుక్తంగా పద్యాలతో కళాకారులు నటిస్తుంటే చూసే ప్రేక్షకులు సంబరపడేవారు. కాని వాటి స్థానాన్ని నేడు సినిమాలు ఆక్రమించుకున్నాయి. అయితే ఏటా దేవీచౌక్‌లో ప్రదర్శిస్తున్న నాటకాలకు ఆదరణ పెరిగి ప్రేక్షకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. రాజమహేంద్రవరం దేవీచౌక్ సెంటర్‌లో దసరా ఉత్సవాలలో ప్రదర్శించే నాటకాలకు విశేష స్పందన ఉంది. దేవీ నవరాత్రులు సందర్భంగా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన నాటకాలను చూడడానికి జనం తండోపతండాలుగా వచ్చేవారు. జనంతోపాటు సినీ తారలు కూడా ఇక్కడకు వచ్చి తిలకించేవారు. సామాన్య జనాలులా పద్యాలకు చప్పట్లు కొట్టి కళాకారులను ఎంకరేజ్ చేసేవారు. అంతే కాకుండా ఇక్కడి లైటింగ్ సెట్లు, డెకరేషన్ చూడడానికి భారీగా తరలివచ్చేవారు. ఇక్కడ సుదీర్ఘంగా 91 సంవత్సరాలు నుంచి బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి శరన్నవరాత్రులు ఉత్సవాలను కమిటీ సభ్యులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.



దేవిచౌక్‌లో ప్రదర్శించే నాటకాల పోస్టర్



జయలక్ష్మి నాట్య మండలి వారు చేస్తున్న డ్రామా (ఫైల్)



డ్రామాను తిలకిస్తున్న, కళాకారులు, భక్తులు (ఫైల్)

రాష్ట్ర వ్యాప్తంగా నాటకాలకు ప్రసిద్ధి

ఇక్కడ ప్రదర్శించే నాటకాల కు రాష్ట్ర వ్యాప్తంగా పేరు రావడంతో ఒక్కసారైనా ఇక్కడ నాటకాలలో నటించాలని ప్రతి కళాకారుడు ఉవ్విళ్లురేవారు. శ్రీరామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణతులాభారం, చింతామణి, బొబ్బిలి యుద్ధం, మహాకవి కళిదాసు, సత్యహరిశ్చంద్ర, గయోపాఖ్యానం, బాలనాగమ్మ, శ్రీరామాంజనేయ యుద్ధం, కురుక్షేత్రం వంటి నాటకాలలో ప్రసిద్ధి రంగస్థలం నటులు నటించారు. సురభివారు ప్రదర్శించే నాటకాలలో ఫైర్ సెట్టింగ్‌కూ పెద్ద పేరు ఉండేది. ఇక్కడ ప్రదర్శించే నాటకాలలో ప్రముఖులు షణ్ముక ఆంజనేయరాజు, పీసపాటి నరసింహమూర్తి, సూరవరపు వెంకటేశ్వర్లు, కాగితం సుబ్బారావు, లక్ష్మణరావు, సీఎస్ఆర్ ఆంజనేయులు, ద్వారంపూడి సూర్యరావు వంటి దిగ్గజాలు ఇక్కడ నాటకాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు.

పాల్గొన్న సినీ ప్రముఖులు

ఎస్వీ రంగరావు, అక్కినేని నాగేశ్వరరావు, సీఎస్ఆర్ ఆంజనేయులు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జమున, ప్రభాకర్‌రెడ్డి, రేలంగి, అంజలీదేవి, ఆదినారాయణరావు, సత్యనారాయణ, వరలక్ష్మి, సావిత్రి, జెమినీ గణేష్, కృష్ణ, శారద, చలం, గీతాంజలి, రాజబాబు వంటి తదితర తెలుగు తారలే కాకుండా సునీల్ దత్ వంటి హిందీ నటులు కూడా ఇక్కడ నాటకాలను తిలకించారు. సుబ్బిశెట్టి నాటకంలో సుబ్బిశెట్టిగా పద్మనాభం, బాలనాగమ్మలో మాయలు ఫకీర్‌గా రాజనాల నటించిగా, 1966-68 సంవత్సరాలలో రాజసులోచన కూడా ఇక్కడ నాట్యం చేశారు.

భారీ సెట్టింగ్‌లకు ప్రసిద్ధి

దేవీచౌక్ నాలుగు కూడళ్లలో భారీ సెట్టింగ్‌లు, విద్యుద్దీపాలంకరణ దేదీప్యమానంగా వెలుగొందుతుంది. ఈ సెట్టింగ్‌లను చూసేందుకు జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా ప్రజలు వచ్చేవారు.

దేవీచౌక్‌లో ప్రదర్శించే నాటకాలు ఇవే

హైదరాబాద్ నవక్రాంతి వారితో శ్రీకనకదుర్గ మహోత్యం, ఉమాశ్రీ కళానికేతన్ వారిచే సత్యహరిశ్చంద్ర, రాజనర్తకి, జయలక్ష్మి నాట్యమండలి వారిచే సత్యహరిశ్చంద్ర, రెండు రత్నాలు, భూకైలాస్, బాలనాగమ్మ, గయోపాఖ్యానం, కురుక్షేత్రం, రామాంజనేయ యుద్ధం వంటి నాటకాలను ప్రదర్శించారు.

క్రమం తప్పకుండా నాటకాల ప్రదర్శన



గత 91 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఇక్కడ నాటకాలను ప్రదర్శిస్తున్నారు. నాటకాలు ఆదరణ తగ్గినా దేవిచౌక్‌లో ప్రదర్శించే నాటకాలకు ఆదరణ పెరుగుతోంది. తొమ్మిది రోజులు ప్రదర్శించే నాటకాలకు జనం విశేషంగా హాజరువుతున్నారు.

– బత్తుల రాజరాజేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

ఆసక్తి ఎక్కువ



దేవీచౌక్ అంటే దసరా ఉత్సవాలకు పెట్టింది పేరు. ఇక్కడ నాటకాలకు ఎంతో పేరుంది. నాటకాలు అంతరించిపోతున్న ఈ సమయంలో ఇంకా ఇక్కడ స్టేజీ మీద నాటకాలు వేయడానికి పలువురు ఆసక్తిగా చూస్తున్నారు. నేను క్రమం తప్పకుండా దేవీచౌక్‌లో ప్రదర్శించే అన్ని నాటకాలను చూస్తాను.

– శ్రీహరి జగన్నాథ్, ఫైర్ ఆఫీసర్

గోదారోళ్ల కితకితల రూపశిల్పి ఈవీవీకి నివాళి

ఓల్డ్ ఏజ్ హోంకి నిత్యావసరాల వితరణ

రాజమహేంద్రవరం రూరల్: గోదారోళ్ల కితకితలు పేస్ బుక్ పేజీ ద్వారా గోదారోళ్ల యాసను విశ్వావ్యాప్తం చేసిన ఘనత బొమ్మూరుకు చెందిన ఈవీవీ సత్యనారాయణదేనని గ్రూప్‌అడ్మిన్లు కొనియాడారు. బుధవారం ఈవీవీ సత్యనారాయణ జయంతి సందర్భంగా గోదారోళ్ల కితకితలు గ్రూపు అడ్మిన్స్ సురుచి మల్లిబాబు, హిమాయత్ మహమ్మద్, ఇతర మోడరేటర్స్ బొమ్మూరులోని రూత్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నిత్యావసర సరకులు అందజేశారు. ముందుగా సత్యనారాయణ సతీమణి రమ, సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోదారోళ్ల కితకితలు గ్రూపు మోడరేటర్స్ విజయ్ చిలుకూరి, కోపల్లె శేషగిరిరావు, పరస జగన్నాథరావు, కేఎస్ఎన్ మూర్తి, సభ్యులు సానా కృష్ణార్జున, మీనాక్షి, బండారు ఆదివిష్ణు, నవీన్ రేలంగి, దివాకర్ మీసాల, నందిని దేవరకొండ, గణపతి, బండారు సతీష్, తదితరులు పాల్గొన్నారు.



రూత్ ఓల్డేజ్‌హోమ్‌కు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న మల్లిబాబు, హిమాయత్, మోడరేటర్స్

మాజీ మంత్రి రామ్మోహనరావు సేవలు స్ఫూర్తిదాయకం

కడియం: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. రామ్మోహనరావు 13వ వర్ధంతిని పురస్కరించుకుని జేగురుపాడులో ఆయన విగ్రహానికి బుధవారం పుష్పాంజలి ఘటించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గం అభివృద్ధికి రామ్మోహనరావు చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ పాలపర్తి ప్రకాష్ కుమార్ (పండు), పుట్టా బుజ్జి, సత్తి హరిబాబు, సొసైటీ ప్రెసిడెంట్ సాక కిరణకుమార్, వనమాలి రాంపండు పాల్గొన్నారు. బుర్రిలంకలో జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో శైలజ, రామకృష్ణ, ఈలి సత్తిబాబు, రత్నం శ్రీకృష్ణ, తుపాటి చిన్న, దుర్గారావు, శ్రీను, సాయిరాం,నాగేశ్వరరావు, జగదీష్ పాల్గొన్నారు. బుర్రిలంకలో జక్కంపూడి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. నాయకులు పాల్గొన్నారు.

జనయోధుడు జక్కంపూడి

కడియం: నిత్యం పేద ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ జనయోధుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిన నాయకులు జక్కంపూడి రామ్మోహనరావు అని ఇండియన్ నర్సరీమెన్ అసోసియేషన్ (ఐఎన్ఏ) మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం అన్నారు. పల్లవెంకన్న నర్సరీ రైతులు పల్ల సత్తిబాబు, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కడియపులంక జాతీయ రహదారి పక్కన, దోసాలమ్మ కాలనీలోని దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సలాది ప్రసాద్, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

క్వారీ ఏరియాలో..

రాజమహేంద్రవరం సిటీ: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు క్వారీ ఏరియా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, ఈ జిల్లా రాజకీయాలకు వన్నెతెచ్చిన నేతని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ ఎస్సీసెల్ అధ్యక్షుడు మాసా రామజోగ్ నివాళులు అర్పించారు. బుధవారం 49వ డివిజన్ సుబ్బారావు నగర్‌లో జక్కంపూడి రామ్మోహన్‌రావు వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ప్రెసిడెంట్ ఆసపు చిన్న సత్యనారాయణ, పితాని వెంకటేశ్వరరావు, పాండవులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వైఎస్సార్ సెంటర్‌లో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి సూచనలతో వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి యెనుముల త్యాగరాజు, కాపు నాయకులు కేపీ నాయుడులు జక్కంపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, సద్గుణ రామారెడ్డి, కోటిపల్లి రవీంద్ర, నిమ్మన నాగేశ్వరరావు, అభిమానులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: జనయోధుడు దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు అని వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ) పేర్కొన్నారు. జక్కంపూడి రామ్మోహనరావు వర్ధంతిని ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లో జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహం వద్ద సాధనాల చంద్రశేఖర్(శివ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ఉపసర్పంచ్ మెండా సత్తులు,వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్,వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఎర్రకొండపై జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహం వద్ద వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి కుమార్, బొడ్డేటి శివాజీ, షబ్బర్ బాషా,గొన్నా సత్తిబాబు, రాము, బూరయ్య తదితరులు పాల్గొన్నారు.



కడియంలో జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



బొమ్మూరులో జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎస్‌టీపీ నిర్మాణ పనుల పరిశీలన

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆవరోడ్డులో రూ.95.50 కోట్లతో మురికినీటి శుద్ధి కర్మాగారం(స్లీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్-ఎస్‌టీపీ) నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టి.కె. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.54 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.34 కోట్లు, మున్సిపల్ కార్పొరేషన్ మ్యాచింగ్ గ్రాంట్ రూ.7 కోట్లు వెచ్చించి ఎస్‌టీపీ నిర్మాణం చేయడంతో రాజమహేంద్రవరం నగరం కాలువల నుంచి వచ్చే మురుగునీరు శుద్ధి అవుతుందన్నారు. బుధవారం నగరపాలక సంస్థ అధికారుల ఆహ్వానం మేరకు కొత్తగా నిర్మిస్తున్న 50.6 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణాన్ని ఆయన సందర్శించి పనులను పరిశీలించారు. వాటి గురించి అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు అన్ని విషయాలను వివరించారు. డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గోదావరి పరిరక్షణ కోసం గతంలో తాను 46 రోజుల పాటు చేసిన దీక్ష ఫలిస్తోందన్నారు. అలాగే మరో 5 ఎంఎల్‌డీ ప్లాంట్ నిర్మాణానికి పనులు జరుగుతున్నాయని, చాలా వరకు ఆ పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. ఇవన్నీ పూర్తయితే 70 శాతం మేరకు ప్యూర్ వాటర్ లభిస్తుందన్నారు. ఇళ్లల్లోని వాడుక నీటిని కూడా శుద్ధి చేసి ఆ నీటిని పరిశ్రమలకు, నర్సరీలకు వాడుకోడానికి వీలుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారని డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు మాట్లాడుతూ 50.6 ఎంఎల్‌డీ సామర్థ్యంగల నూతన ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణం 15 నెలల వ్యవధిలో పూర్తికావాల్సి ఉందని, అయితే గడచిన రెండు నెలల్లో వర్షాల వల్ల ఇబ్బంది పడ్డామని తెలిపారు. అయితే ఇప్పుడు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్స్‌ఆలీ, ఏఈ శ్రీధర్, గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు దారా శేషుకుమార్, దాసరి జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌టీపీ ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న విశేశ్వరరెడ్డి, చిత్రంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు

ఉచిత న్యాయ సహాయానికి 15100కు డయల్ చేయండి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రజలు 15100కు డయల్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉచిత న్యాయ సహాయానికి 15100 నంబర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బుధవారం ఉచిత సహాయక ఫోన్ నంబర్ 15100 పోస్టర్‌ను జిల్లా ప్రధానన్యాయమూర్తి ఆవిష్కరించారు.

పూర్వ విద్యార్థుల కలయిక

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక అల్కాట్‌తోటలోని ఆర్‌సీఎం ఎయిడెడ్ హైస్కూల్ 2001లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు బుధవారం అదే పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ ఒక్క చోటకు చేసి రోజంతా సందడి చేశారు. అనాటి జ్ఞాపకాలను నెమరివేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి హైస్కూల్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కె.విజయకుమార్, దుర్గాప్రసాద్, సంతోష్, సీహెచ్ శ్రీనులు కీలకపాత్ర పోషించారని వారిని తోటి పూర్వవిద్యార్థులు అభినందనలు తెలిపారు.



ఆర్‌సీఎం ఎయిడెడ్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

సరస్వతీదేవి నమోస్తుతే..

- సరస్వతీమాత అలంకరణలో దుర్గాదేవి
- మూలనక్షత్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

సీటీఆర్‌ఐ: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో ఆరో రోజు బుధవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో సరస్వతీమాత పూజలందుకున్నారు. అధిక సంఖ్య భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలో సరస్వతీ దేవి అలంకరణలో దుర్గమ్మ దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారిని దర్శించుకోవాడానికి భక్తులు బారులు తీరారు. నవరాత్రుల వేళ దుర్గమ్మ ధరించే సరస్వతీ అలంకరానికొక విశేషముంది. ఆ రూపంలో ఉన్న జగదంబను పిల్లలకు దర్శనం చేయిస్తే మంచి చదువు అలవడుతాయని పెద్దల నమ్మకం. ఈ సందర్భదంగా కొంత మంది పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. దేవీచౌక్‌లో రాజరాజేశ్వరి దేవిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచే తల్లితండ్రులు తమ పిల్లలను తీసుకుని వచ్చి అక్షరాభ్యాసం చేయించారు. సీతంపేట రామమందిరంలో ఉన్న మహాలక్ష్మీదేవి, విజయ కనక దుర్గాదేవి అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అమ్మవారు శ్రీ ధ్యాన సరస్వతీ అవతార రూపంలో భక్తులకు దివ్య దర్శనం అందజేశారు. స్థానిక కోరుకొండ రోడ్డులోని సాయి కనకదుర్గ ఆలయం వద్ద సోమవారం జొన్నాడ వీరవెంకట సుబ్బారావు, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో పిల్లలకు విద్యాభ్యాసం నిర్వహించారు. స్థానిక రాజేంద్ర నగర్‌లోని అమ్మవారికి బోనాలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి సమర్పించారు. జ్ఞాన సరస్వతి పీఠంలో సరస్వతి దేవీకి హోమం చేశారు.



దుళ్ల మార్కెట్ సెంటర్‌లో సరస్వతి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



శ్రీసాయి కనకదుర్గ ఆలయంలో చిన్నారులకు విద్యాభ్యాసం చేయిస్తున్న తల్లులు

సరస్వతీదేవి అవతారంలో...

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని బుధవారం సరస్వతీదేవిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో విద్యార్థులతో సరస్వతీ పూజలు ఘనంగా నిర్వహించారు. బాలాజీపేటలో ఉన్న విజయ కనక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసుల రెడ్డి, వాసంశెట్టి సూర్యగణేష్, తలారి శ్రీనివాసరావు, సూరంపూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి కనకదుర్గమ్మ ఆలయంలో

పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని వెంకటగిరి వివేకానంద వీధిలో ఉన్న కనకదుర్గమ్మ వారి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారు సరస్వతీమాతగా పూజలందుకున్నారు. వివేకానంద యూత్ కమిటీ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. గ్రామ మాజీ ఉప సర్పంచ్, హుకుంపేట సొసైటీ మాజీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

దుళ్లలో శాస్త్రోక్తంగా సరస్వతీ పూజ


కడియం: జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన దుళ్ల మార్కెట్ సెంటర్‌లోని శ్రీశారదాదేవి శరన్నవరాత్ర ఉత్సవాల్లో అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బుధవారం సరస్వతీదేవీ అలంకరణతో దర్శమిచ్చిన అమ్మ వారికి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సుమారు వెయ్యి మంది విద్యార్థులతో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో పాటు తల్లితండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. ఆలయ కమిటీ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు చందన సత్తిబాబు బావ మరిది గొర్రె సురేష్ జ్ఞాపకార్థం భక్తులందరికీ పచ్చని మొక్కలు పంపిణీ చేశారు. తాతపూడి బాబీ, చందన సత్తి బాబు, కట్టుంగ నాగరాజు, తొట్టా సత్తి బాబు, కవిలి సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.



మోరంపూడి సాయినగర్‌లో సరస్వతీదేవిగా అమ్మవారు



ఉమా మార్కండేయ ఆలయంలో పుస్తకాలతో పార్వతీదేవికి అలంకరణ



ఉమా మార్కండేయ స్వామి ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు

దానవాయిపేట గాంధీ పార్కుకు మోక్షం

ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

సాక్షి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం సిటీ: సుమారు ఏడాది కాలం తరువాత దానవాయిపేట గాంధీ మున్సిపల్ పార్కుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సెప్టెంబర్ 30వ తేదీ 'గాంధీ పార్కు గాలికొదిలేశారు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. బుధవారం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి పార్కును ప్రారంభించారు. దానవాయిపేటలో రూ.2.50 కోట్ల రూపాయలతో నిధులతో మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ శంకుస్థాపన చేశారు. అయితే పనులు పూర్తయినా ప్రారంభించకపోవడంతో వార్త ప్రచురితమైంది. ఆధునికరించిన గాంధీ పార్కును సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్థానిక నాయకులు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నగరపాలకు సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.